

అన్నదాతకు ఊరట..

క్రమంగా ఎరువుల ధరలు తగ్గుతుండటంతో రైతుకు ఊరట కలుగుతోంది.

వివరాలు 8లో ▸



నిరంతర పోరాటం

ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తానని ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
41.2 /28.3

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోత పెడుతుంది.

న్యూస్‌రీల్

సంత స్థలానికి హద్దులు ఏర్పాటు



పెబ్బేరు: పట్టణంలోని సంత స్థలాన్ని ఆర్డీఓ పద్మావతి, జిల్లా సర్వే ఏడీ బల్‌రాం నాయక్‌, ఆధ్వర్యంలో గురువారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ప్రతి శనివారం నిర్వహించే సంత స్థలం మొత్తం 30.19 గుంటల భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. దీనిలో 14 ఎకరాలు శాశ్వతంగా సంత నిర్వహించేందుకు హద్దులు చూపడం జరిగింది. అలాగే, సంత స్థలం చుట్టూ కొంత కబ్జాకు గురికాగా.. వారికి త్వరలో నోటీసులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ కరుణశ్రీ, కౌన్సిలర్లు యల్లారెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌ ఆదిశేషు, డిప్యూటీ తహసీల్దార్‌ జయసింహ, నాయకులు సాయినాథ్‌, మహేందర్‌గౌడ్‌, సత్యనారాయణ, మేకల యల్లయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం


వనపర్తి: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం నుంచి రాయితీపై అందజేసే చేపల మార్కెటింగ్‌ వాహనాల కోసం అర్హులైన మత్స్యకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తునట్లు మత్స్యశాఖ అధికారి రహెమాన్‌ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.10 లక్షల విలువ గల వాహనాన్ని ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 60 శాతం సబ్సిడీపై, జనరల్‌ కేటగిరి వారికి 40 శాతం సబ్సిడీపై అందజేయనున్నట్లు తెలిపారు.

27, 28న కవి సమ్మేళనం



వనపర్తి టౌన్‌: ఈనెల 27, 28వ, తేదీల్లో పట్టణంలోని దాచలక్ష్మయ్య ఫంక్షన్‌ హాల్‌లో నిర్వహించబోయే పాటకు పట్టాభిషేకం, కవి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని స్టీరింగ్‌ కమిటీ సభ్యులు గంధం నాగరాజు, డి. కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మోహన్‌ యాదవ్‌, ప్రధాన కార్యదర్శి బాలనాగయ్య, కమిటీ సభ్యులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ... పాటకు, కవిత్వాలకు ఆదరణ తగ్గుతున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రెండు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో మొదటి రోజు పాటకు పట్టాభిషేకం, రెండోరోజు కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టీరింగ్‌ కమిటీ సభ్యుడు, ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్‌, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'పేట'కు కేంద్ర మంత్రి రాక



మహేందర్‌నాథ్‌ పాండే, కేంద్ర మంత్రి

నారాయణపేట రూరల్‌: పాలమూర్‌ పార్లమెంట్‌ ప్రవాస్‌ యోజన కార్యక్రమంలో భాగంగా కేంద్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి మహేందర్‌నాథ్‌ పాండే జిల్లాకు రానున్నారు. రెండురోజుల పాటు పర్యటించే క్రమంలో శుక్రవారం రాత్రి పట్టణానికి చేరుకుని ముఖ్యకార్యకర్తలతో సమావేశం నిర్వహించి బస చేస్తారు. శనివారం ఉదయం కుమ్మరివాడలో పర్యటించి కార్మికుల సమస్యలు తెలుసుకుంటారు. అనంతరం అప్పక్‌పల్లిలో నిర్మిస్తున్న జిల్లా ఆస్పత్రి, మెడికల్‌ కళాశాల భవన నిర్మాణం పరిశీలిస్తారు. కోటకొండలో చేనేత కార్మికులను కలుసుకుని వారితో సమావేశమవుతారు. ఈ మేరకు కార్యకర్తలు, నాయకులు సహకరించాలని జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసులు కోరారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్‌ జారీ చేసిందని జిల్లా కన్వీనర్‌ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌ శాంతయ్య ప్రకటనలో తెలిపారు. ఐటీఐ కోర్సుల్లో చేరేవారు 10, 8వ తరగతిలో వివిధ కోర్సుల వారీగా అర్హత ఉందని, 14ఏళ్ల వయసు వారు, వచ్చే నెల 10వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

మరమ్మతుకు నోచుకోని ఎత్తిపోతల పథకాలు

- ఏడాది క్రితం రూ.2కోట్లతో ప్రతిపాదనలు.. నేటికీ మంజూరు కాని నిధులు
- అమరచింత, చంద్రఘడ్‌, నాగిరెడ్డిపల్లి, బెక్కర్‌పల్లి లిఫ్ట్‌ల దుస్థితి
- మొత్తం 20వేల ఎకరాల ఆయకట్టు..
- పూర్తి స్థాయిలో పంటలకు నీరందక రైతుకు తప్పని నిరాశ

అమరచింత: ఎత్తిపోతల పథకాల మరమ్మతుకు నిధులు మంజూరవుతాయని.. ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందనుందని.. నీటి ఇక్కట్లు తీరి పంటలు బాగా పండుతాయని ఎంతో ఆశపడ్డ రైతుకు నిరాశే మిగిలింది. జిల్లాలోని అమరచింత, చంద్రఘడ్‌ ఎత్తిపోతల, నాగిరెడ్డిపల్లె, బెక్కర్‌పల్లి ఎత్తిపోతల పథకాల మరమ్మతుల కోసం నీటి పారుదల శాఖ అధికారులు రూ.2కోట్లతో గతేడాది ప్రతిపాదనలు పంపారు. నేటికీ పంపించిన బడ్జెట్‌ ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉండటంతో నీటిపారుదల శాఖ అధికారులు ఎదురుచూస్తున్న పరిస్థితులు దాపురించాయి. ప్రస్తుతం అధికారులు పంపిన ప్రతిపాదనల పనులకు ప్రభుత్వం ఎప్పుడు నిధులను మంజూరు చేస్తుందో.. ఎప్పుడు పనుల కోసం టెండర్‌లను ఆహ్వానిస్తుందని ఆయా ఎత్తిపోతల పథకాల కార్యాచరణ కమిటీ సభ్యులు ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే పేరుగాంచిన అమరచింత లిఫ్ట్‌కు ప్రధాన పైపుల కొనుగోలు, మరమ్మతు పనులు, అలాగే చంద్రఘడ్‌ ప్రధాన ఎత్తిపోతల పథకానికి సంబంధించి అండర్‌ పైప్‌లైన్‌ల మరమ్మతులు సుమారు 150కి పైగా వున్నాయని అధికారులు గుర్తించారు. వీటికోసం పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరును అందించేందుకు చర్యలు తీసుకున్నారు.



చంద్రఘడ్‌ ఎత్తిపోతల పథకం ప్రధాన పంప్‌హౌజ్‌

ప్రతిపాదనలు ఇలా..

అమరచింత ఎత్తిపోతల పథకానికి సంబంధించి నీటిపారుదల శాఖ అధికారులు లీకేజీలకు మరమ్మతుల కోసం రూ.37 లక్షల ప్రతిపాదనలతో పనులను గుర్తించారు. బెక్కర్‌పల్లి ఎత్తిపోతల లీకేజీల మరమ్మతుకు రూ.20.50లక్షలు, నాగిరెడ్డిపల్లి లిఫ్ట్‌లో ప్యానల్‌ బోర్డ్‌తో పాటు లీకేజీల మరమ్మతుల కోసం రూ.1.9కోట్లతో పనులను చెపట్టడానికి ప్రణాళిక రూపొందించారు. వీటిని నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతోపాటు స్థానిక ఎమ్మెల్యేకు నివేదికలను సమర్పించినట్లు జూరాల ప్రాజెక్టు నందిమళ్ళ డ్యాం డివిజన్‌ ఏఈ అంజనేయులు తెలిపారు.

ఆయకట్టు వివరాలు

అమరచింత ఎత్తిపోతల పథకం ద్వారా 4500 ఎకరాలకు సాగునీరు అందించాలని అప్పట్లో ప్రతిపాదనలు చేసిన అధికారులు ప్రస్తుతం 2వేల ఎకరాలకు మాత్రమే నీరు అందిస్తున్నారు. చంద్రఘడ్‌ ఎత్తిపోతల కింద 5వేల ఎకరాల ఆయకట్టు ఉండగా ప్రస్తుతం 1500 వందల ఎకరాలకు నీరు అందిస్తున్నారు. బెక్కర్‌పల్లి లిఫ్ట్‌ ద్వారా 5 వేల ఆయకట్టుకు వెయ్యి ఎకరాలు, నాగిరెడ్డిపల్లి ద్వారా 5వేల ఎకరాలకుగాను ప్రస్తుతం ప్యానల్‌ బోర్డు కాలిపోవడంతో ఆయకట్టుకు నీటిని అందించలేకపోతున్నారు.



అమరచింత ఎత్తిపోతల పథకం పంప్‌హౌజ్‌

“ నిధులు మంజూరు చేయాలి

లీకేజీలను గుర్తించి వాటి మరమ్మతు పనులు చెయ్యడం ద్వారా ఆయకట్టు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం వుంది. నీటిపారుదల శాఖ అధికారులు లిఫ్ట్‌ మరమ్మతుకు రూ.37 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం నిధు లు మంజూరు చేసి త్వరగా పనులను చేపట్టాలి.

– ఆంజనేయులు, అమరచింత లిఫ్ట్‌ కార్యదర్శి.

వెంటనే మరమ్మతు చేపట్టాలి



చంద్రఘడ్‌ ఎత్తిపోతల పథకంలో భాగమైన నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకానికి సంబంధించి రూ.కోటితో ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి లీకేజీలను గుర్తించి పనులను చెపడితే చంద్రఘడ్‌ ఎత్తిపోతల పథకం రైతుల భాగస్వామ్యంతో సజావుగా కొనసాగే వీలుంది.

– సర్వారెడ్డి, లిఫ్ట్‌ అధ్యక్షుడు, మిట్టనందిమళ్ల

ప్రతిపాదనలు పంపించాం



అమరచింత, చంద్రఘడ్‌, బెక్కర్‌పల్లి, నాగిరెడ్డి ఎత్తిపోతల పథకాల మరమ్మతుకు రూ.1.87కోట్ల బడ్జెట్‌తో ప్రతిపాదనలను గతేడాది నివేదించాం. అలాగే, నివేదికను ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి అందించాం. నిధులు మంజూరైన వెంటనే టెండర్లు ఆహ్వానిస్తాం.

– జగన్మోహన్‌, ఈఈ, పీజేపీ నందిమళ్ల డ్యాం డివిజన్‌

కాలిన ప్యానల్‌ బోర్డు.. వేల ఎకరాలు బీడు..

చంద్రఘడ్‌ ప్రధాన ఎత్తిపోతల పథకంలో భాగమైన నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ప్యానల్‌ బోర్డు ఏడేళ్ల క్రితం కాలిపోయింది. వీటిని తొలగించి కొత్త ప్యానల్‌ బోర్డు ఏర్పాటు చెయ్యాలని ఆయకట్టు రైతులు పలుమార్లు ప్రభుత్వానికి, అధికారులకు విన్నంచారు. సమస్యలను పరిష్కరించకపోవడంతో నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల ద్వారా సాగవుతున్న 4,500 ఎకరాల ఆయకట్టు సాగునీరు అందక బీడు వారింది. దీంతో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చొరవతో నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన మరమ్మతు పనుల ప్రతిపాదనలను తమకు అందించాలని ఇరిగేషన్‌ శాఖకు ఆదేశించడంతో వీటికోసం ఎంత ఖర్చు అవుతుందనే ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేశారు.



కాలిపోయిన నాగిరెడ్డిపల్లి లిఫ్ట్‌ ప్యానల్‌ బోర్డు

పనులు నాణ్యతగా చేపట్టాలి



ఇంకుడు గుంత పనులు ప్రారంభిస్తున్న అడిషనల్‌ కలెక్టర్‌ వేణుగోపాల్‌

పెబ్బేరు: మన ఊరు – మన బడి, పల్లె ప్రగతిలో భాగంగా చేపడుతున్న నిర్మాణ పనులు నాణ్యతగా ఉండాలని అడిషనల్‌ కల్లెకర్‌ వేణుగోపాల్‌ అన్నారు. గురువారం మండలంలోని కంచిరావుపల్లి చేపట్టిన పలు అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, నర్సరీలో వేసిన మొక్కలు పరిశీలించారు. అలాగే పాఠశాలలో కమ్యూనిటీ ఇంకుడు గుంత నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్‌ భాస్కర్‌, తహసీల్దార్‌ అబ్రహం లింకన్‌, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌, ఎంపీవో రోజా రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మల్లయ్య, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో సౌకర్యాలు కల్పించాలి

వనపర్తి: అద్దె భవనాల్లో కొనసాగిస్తున్న గురుకుల విద్యాలయాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని జెడ్పీ చైర్మన్‌ ఆర్‌.లోకనాథ్‌రెడ్డి చెప్పారు. గురువారం జెడ్పీ కార్యాలయంలో స్థాయి సంఘాల సమావేశం నిర్వహించారు. సీఈఓ శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. విద్యాశాఖ, గురుకులం విద్యాలయాల కో ఆర్డినేటర్లతో మాట్లాడారు. భవనాలను అద్దెకు ఇచ్చిన యాజమాన్యంతో సౌకర్యాలను ఏర్పాటు చేసేలా ప్రయత్నం చేయాలన్నారు. ప్రభుత్వ భవనాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం జెడ్పీ నిధులు ఇస్తామని ఆయన అన్నారు.

ఫలితాలు మెరుగుపడాలి



మాట్లాడుతున్న కలెక్టర్‌ తేజస్‌ నంద్‌లాల్‌ పవార్‌

- మొక్కుబడి విధులకు స్వస్తి పలకాలి
- మరోసారి ఇలాంటి ఫలితాలు రావొద్దు
- పది, ఇంటర్‌ ఫలితాల్లో జిల్లా వెనుకబడటంపై కలెక్టర్‌ అసహనం

వనపర్తి: ఇటీవల వెలువడిన పది, ఇంటర్‌ ఫలితాల్లో జిల్లా వెనకబడడం శోచనీయమని.. మొక్కుబడి విధులకు స్వస్తి పలికి, అంకితభావంతో పనిచేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు అని.. ఆమేరకు ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని కలెక్టర్‌ తేజస్‌ నంద్‌లాల్‌ పవార్‌ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పాఠశాల, ఇంటర్‌ విద్యాశాఖలు, గురుకుల విద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. ఫలితాల్లో జిల్లా వెనుకబాటుతనానికి కారణాలు ఏంటని విద్యాశాఖ అధికారులను అడిగారు. విద్యార్థులు సక్రమంగా పాఠశాలలకు హాజరు కాకపోవడం, తల్లిదండ్రులు వలసలు వెళ్లటం వలన ఇంటి వద్ద కనీసం చదివించే అవకాశం లేకపోవటం ప్రధాన కారణాలని డీఈఓ గోవిందరాజులు తెలిపారు. సబ్జెక్టు వారీగా టీచర్ల కొరత ఉండడం, విద్యార్థులు సెల్‌ ఫోన్లు వాడటం, పండగ సమయాల్లో తమ ఏకాగ్రతను కోల్పోవడం కారణాలు సైతం ఉతీర్ణత తగ్గటానికి కారణాలుగా చెప్పారు.



సమావేశానికి హాజరైన విద్యాశాఖ అధికారులు

డిజిటల్‌ విద్యను అందించాలి

ఇకముందు ఉపాధ్యాయులు మారిన కాలాను గుణంగా బ్రిడ్జ్‌ కోర్సులు, డిజిటల్‌ విద్యను అందించాలని, విద్యార్థులను చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ భాగస్వాములను చేయాలని కలెక్టర్‌ సూచించారు. సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు, సెక్టోరియల్‌ అధికారులు పాఠశాలలపై పర్యవేక్షణ పెంచాలని కలెక్టర్‌ ఆదేశించారు. సమావేశంలో ఆర్సీఓ వనజ, సోషల్‌ వెల్ఫేర్‌ అధికారిణి సుషిత, బీసీ వెల్ఫేర్‌ అధికారి అనీల్‌కుమార్‌, ట్రైబల్‌ వెల్ఫేర్‌ అధికారి శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలపై దృష్టి

ఈ నెల 19వ నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను సజావుగా నిర్వహించాలని కలెక్టర్‌ తేజస్‌ నందలాల్‌ పవర్‌ మున్సిపల్‌ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం సమీకృత కలెక్టరేట్‌లో ఆయా మున్సిపల్‌ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు, డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణపై మున్సిపల్‌ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆకస్మిక తనిఖీలు చేసి ఫొటోలు తనకు పంపాలని సూచించారు. స్వచ్ఛ వాహనం ప్రతి ఇంటికి వెళ్తుందా లేదా పర్యవేక్షణ చేయాలని, ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలని లేదంటే వ్యర్థాలను మురుగుకాల్వలు, బహిరంగ ప్రదేశాల్లో వేస్తారన్నారు. రానున్న 9 రోజుల పాటు పట్టణాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి శుభ్రం చేయాలన్నారు. కూరగాయల, పండ్ల షాపులతో పాటు చికెన్‌ మటన్‌ షాపుల వద్ద ప్రతిరోజు ఒక జవాను పర్యవేక్షించాలని, అప్పుడే ఆయా షాపుల వారు పరిశుభ్రత పాటిస్తారన్నారు. రోడ్లపై ఎక్కడా చెత్తా చెదారం కానరాకూడదని, రోడ్లపై నాలా గుంతలు ఉంటే గుర్తించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మిషన్‌ భగీరథ నీటిపై సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌ వేణుగోపాల్‌ డి. వేణుగోపాల్‌, వనపర్తి మున్సిపల్‌ చైర్మన్‌ గట్టు యాదవ్‌, ఆయా మున్సిపాలిటీల కమీషనర్లు, అధికారులు సిబ్బంది ఉన్నారు.

పోలీస్‌ వ్యవస్థపై నమ్మకం పెంచాలి



సమీక్షిస్తున్న ఎస్పీ రక్షిత కే.మూర్తి

వనపర్తి: సాయం కోసం స్టేషన్‌కు వచ్చే వారిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి, తగు సేవలు అందించడంలో రిసెప్షన్‌ అధికారి పాత్ర కీలకమైనదని, ప్రజలందరికీ పోలీస్‌ వ్యవస్థపై నమ్మకం, విశ్వాసం పెంచేలా రిసెప్షన్‌ అధికారి ముఖ్య పాత్ర పోషించాలని ఎస్పీ రక్షితా కె. మూర్తి సూచించారు. గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో పద్నాలుగు వర్టికల్స్‌ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రిసెప్షన్‌, స్టేషన్‌ రైటర్‌, బ్లూ కోర్ట్‌, పెట్రోకార్‌, కోర్టు డ్యూటీ ఆఫీసర్‌, టెక్‌టీం, 5ఎస్‌, కమ్యూనిటీ పోలీసింగ్‌, ట్రాఫిక్‌, స్టేషన్‌ ఇంచార్జ్‌, ఎస్‌హెచ్‌ఓ, ఐఓ, సైబర్‌ క్రైమ్స్‌ విభాగాలను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. కేసుల ఛేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలని, నాన్‌బెయిలబుల్‌ వారెంట్‌లను త్వరగా ఎగ్జిక్యూట్‌ చేయాలని, నేరఛేదనకు ఎంతగానో ఉపయోగపడే సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సైబర్‌ క్రైమ్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు వస్తే వెంటనే నమోదు చేయాలని, సైబర్‌ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. రానున్న ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుండే ఎస్‌హెచ్‌ఓలు వారి పరిధిలోని గ్రామాల్లో పర్యటించి ప్రజలు, యువకులతో సత్సంబంధాలు మెరుగుపరుచుకోవాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచడంతోపాటు అనుమానాస్పదంగా తిరిగే కొత్త వ్యక్తుల గురించి విచారణ చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ షాకీర్‌ హుస్సేన్‌, డీఎస్పీ ఆనంద్‌ రెడ్డి, సీఐలు డీకే. మహేశ్వర్‌ రావు, శ్రీనివాసరెడ్డి, రత్నం డీసీఆర్‌బీ ఎస్‌ఐ వెంకటేష్‌గౌడ్‌ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు పాలమూరు క్రీడాకారులు

మహబూబ్‌నగర్‌ క్రీడలు: హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్‌ స్కూల్‌లో శుక్రవారం జరగనున్న జన జాతీయ ఖేల్‌ మహోత్సవం రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు జిల్లా క్రీడాకారులు వెళుతున్నట్లు జిల్లా ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.రాంచందర్‌ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు వెళుతున్న క్రీడాకారులను గురువారం జిల్లాకేంద్రంలోని మెయిన్‌ స్టేడియంలో అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని కోరారు. ఇండియన్‌ రౌండ్‌ విభాగంలో ఆర్‌.సుజాత, రవి, వసంత, మనోజ్ఞ, సంతోష్‌కుమార్‌ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి, ఆర్చరీ కోచ్‌ జ్ఞానేశ్వర్‌ పాల్గొన్నారు.



ప్రేమ.. పెళ్లి.. ఆత్మహత్య

- భర్తతో పంపలేదని నవవధువు బలవన్మరణం
- పెళ్లైన వారం రోజులకే విషాదం నింపిన క్షణికావేశం

నవాబుపేట: వారిద్దరు ప్రేమించుకున్నారు.. పెద్దలను ఒప్పించి మరీ పెళ్లి చేసుకున్నారు.. కానీ, వారి ప్రేమ పెళ్లిలో వారం రోజులు గడవక ముందే విషాదం నిండింది. పెళ్లి తర్వాత అత్తారింటికి వెళ్లి పుట్టింటికి వచ్చిన నవ వధువును తిరిగి భర్తతో పంపించలేదని మనస్తాపానికి గురైన ఆమె క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదకర సంఘటన మహబూబ్‌నగర్‌ జిల్లా నవాబుపేట మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గురుకుంటకు చెందిన పిల్లి అంజమ్మ మూడేళ్ల క్రితం భర్త చనిపోవడంతో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు పిల్లి అనూష(19), శివాని ఉన్నారు. ఇంటర్‌ వరకు చదివిన అనూష ఇంటివద్దే ఉంటుంది. అదే గ్రామానికి చెందిన బోయని శివశంకర్‌తో కొంతకాలంగా ప్రేమలో ఉంది. అయితే వీరి ప్రేమకు ఇరు కుటుంబ సభ్యులు మొదట అభ్యంతరం చెప్పగా.. ఇద్దరు వారి కుటుంబాలను ఒప్పించారు. దీంతో ఈ నెల 12న గ్రామ సమీపంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో అందరి సమక్షంలో వివాహం జరిగింది. కాగా పెళ్లి అయిన అనంతరం వడిబియ్యం వండుదామని ఈ నెల 15న కూతురు అనూష, అల్లుడు శివశంకర్‌ను పిల్లి అంజమ్మ తన ఇంటికి తీసుకొని వచ్చింది. కాగా ఆ మరుసటి రోజు తన భార్యను తీసుకువెళ్తానని అల్లుడు చెప్పగా.. కొత్త పెళ్లి కూతురిని పుట్టింటి నుంచి మంగళవారం పంపించొద్దని.. బుధవారం చిన్న కూతురు శివానికి పరీక్ష ఉండడంతో.. గురువారం పంపిస్తానని అత్త అంజమ్మ అల్లుడికి చెప్పింది. దీంతో తనను భర్తతో పంపించడం లేదని మనస్తాపం చెందిన అనూష బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరింది. గమనించిన చుట్టుపక్కల వారు అంజమ్మకు, శివశంకర్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు వచ్చి 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్‌ జనరల్‌ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఈ ఘటనపై అనూష తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. అనూష క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయంతో ఇరు కుటుంబాల్లో విషాదం అలుముకుంది.



అనూష, శివశంకర్‌ పెళ్లి ఫొటో (ఫైల్‌)

మహిళల ఆర్థిక పెట్టుబడులకు తపాలా శాఖ భరోసా

కందనూలు: మహిళా పెట్టుబడిదారులను ప్రోత్సహించడానికి, వారిని ఆర్థిక చేరికలో భాగస్వాములు చేసి తద్వారా మహిళల సాధికారత సాధించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సర వార్షిక బడ్జెట్‌లో తపాలా శాఖ ద్వారా మహిళా సమ్మాన్‌ సేవింగ్స్‌ సర్టిఫికేట్‌ (ఎంఎస్‌ఎస్‌సీ) అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టిందని పోస్టాఫీస్‌ సబ్‌డివిజన్‌ ఇన్‌స్పెక్టర్‌ విక్రమ్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా పరిధిలోని వివిధ పోస్టాఫీసుల్లో 400 ఖాతాలు, హైదరాబాద్‌ రీజియన్‌ మొత్తంలో 15 వేల ఖాతాలు తెరిచామన్నారు. ఈ పథకంలో తనకు తానుగా ఒక మహిళ లేదా.. బాలిక తరపున సంరక్షకుడు కనిష్టంగా రూ.వెయ్యి నుంచి గరిష్టంగా రూ.2 లక్షల వరకు జమ చేసుకోవచ్చని, దీనికి గాను ఏడాదికి 7.5 శాతం వడ్డీ త్రైమాసికంగా లెక్కించి ఖాతా పరిపక్వత చెందిన సమయంలో చెల్లిస్తారన్నారు. ఖాతా తెరిచిన తర్వాత అవసరాల నిమిత్తం ఏడాది తర్వాత 40 శాతం విత్‌డ్రా చేసుకోవచ్చని చెప్పారు. ఖాతాదారు లేదా సంరక్షకుడు మరణించిన సందర్భంలో లేదా, ఆరోగ్య పరిస్థితి ప్రాణాపాయంలో ఉన్నప్పుడు, ఖాతా తెరిచినా 6 నెలల తర్వాత ప్రీ-మెచూర్‌ క్లోజర్‌ చేసుకునే అవకాశం ఉందని, దీనికి గాను 5.5 శాతం వడ్డీ చెల్లిస్తారన్నారు. ఖాతా తెరవడానికి కేవైసీ డాక్యుమెంట్స్‌తోపాటు 2 పాస్‌పోర్ట్‌ సైజు ఫొటోలతో పోస్టాఫీస్‌లో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్దకల్ మండలం మద్దెలబండకు చెందిన పాపమ్మ(55) పదకొండు రోజుల క్రితం గర్భసంచి శస్త్ర చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి వచ్చింది. ఆరోగ్య పరీక్షలు చేసి రెండు రోజుల క్రితం వైద్యుడు సివిల్ సర్జన్ కిశోర్‌కుమార్ గర్భసంచి శస్త్ర చికిత్స చేశాడు. గురువారం తెల్లవారుజామున ఆమె మృతి చెందింది. మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై వైద్యుడిని వివరణ కోరగా.. శస్త్రచికిత్స చేసిన మాట వాస్తవామేనని, వైద్యుల నిర్లక్ష్యం ఎంత మాత్రం లేదన్నారు. ఆమెకు పలు అనారోగ్య సమస్యలు సైతం ఉన్నాయని తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..


రంగన్న (ఫైల్)

ధరూరు: పొలం వద్ద నీళ్లు పారించేందుకు వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని నెట్టెంపాడు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు సత్యారం రంగన్న(38) తన కుమారుడితో కలిసి గురువారం ఉదయం పొలానికి వెళ్లాడు. తన పత్తి పంటకు నీళ్లు పారించే క్రమంలో తరచూ కరెంటు వస్తూ, పోతూ ఉండడంతో మధ్యాహ్నం సమయంలో మోటారును స్టార్ట్ చేసేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శవాన్ని గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం చేయించారు. మృతినికి భార్యతో పాటు కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ హుస్సేన్ తెలిపారు.

వింతగా ప్రవర్తించిన బాలిక..

గండేడ్: వింతగా ప్రవర్తిస్తూ తనకు చేతబడి చేశారని, తాను చనిపోతానని ఒకరోజు ముందు చెప్పిన బాలిక మరుసటి రోజే మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని రుసుంపల్లికి చెందిన బోయ నర్సింహులు కూతురు శివమణి(12) మూడు రోజులుగా వింతగా ప్రవర్తించింది. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చూపించినా తగ్గలేదు. బుధవారం మరింత వింతగా ప్రవర్తిస్తూ.. తనకు మంత్రాలు చేశారని తనను తీసుకుపోవడానికి ఎవరో వచ్చారని, తాను చనిపోతున్నానని చెబుతూ తిట్టడం చేసింది. ఈ క్రమంలో గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో బాలిక మృతిచెందడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు. తమ అమ్మాయికి ఏదో చేయడం వల్లే చనిపోయిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు..


శివకుమార్ (ఫైల్)

పెబ్బేరు: ప్రమాదవశాత్తు ఇసుక ట్రాక్టర్ బోల్తా పడటంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన గుర్రం జయరాములు కుమారుడు గుర్రం శివకుమార్(19), ట్రాక్టర్ డ్రైవర్ గంగాధర్ ఇద్దరూ కలిసి గురువారం కృష్ణానది సమీపంలో ట్రాక్టర్ ద్వారా ఇసుక లోడుతో వస్తున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్‌ను మలుపు దగ్గర రంగాపూర్ గ్రామం వైపు అకస్మాత్తుగా తిప్పడంతో వ్యవసాయ పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ పక్కనే కూర్చున్న శివకుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై శివకుమార్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగదీశ్ తెలిపారు.

బైక్ పైనుంచి పడి వ్యక్తి..


చంద్రశేఖర్ రెడ్డి (ఫైల్)

రాజోళి: రాజోళి గ్రామ పంచాయతీ పరిధిలోని తుమ్మల పల్లె గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి(63) బైక్‌పై నుంచి పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గురువారం తుమ్మల పల్లె నుంచి పచ్చర్లలోని తన పొలం చూసేందుకు బైక్‌పై వెళ్లాడు. కాగా పడమటి గార్లపాడు దాటాక రోడ్డుపై ఉన్న గుంత వద్ద బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలోనే చంద్రశేఖర్‌రెడ్డి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని అలంపూర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సీహెచ్ కుర్మయ్య తెలిపారు.

రైతన్నకు ఊరట..


రసాయనిక ఎరువుల బస్తాలు

- దిగివస్తున్న కాంప్లెక్స్ ఎరువుల ధరలు
- వచ్చే వానాకాలం నుంచి ఒకే బ్రాండ్ కింద ఎరువుల అమ్మకాలు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): కష్టకాలంలో రైతన్నకు ఊరట కలుగుతోంది. ఎరువుల ధరలు తగ్గుతుండటంతో కాస్త ఉపశమనం లభించనుంది. పంట పెట్టుబడి భారంగామారిన తరుణంలో ఎరువుల ధరలు నెలనెలా దిగి వస్తున్నాయి. రానున్న వానాకాలం నాటికి మరింత తగ్గే అవకాశం ఉందని ఎరువుల ఉత్పత్తి సంస్థల యాజమాన్యం చెబుతోంది. అంతర్జాతీయంగా ముడిసరుకుల రేట్లు తగ్గుముఖం పట్టడంతో ఎరువుల ధరలు తగ్గిస్తున్నట్లు పేర్కొంటున్నారు. అదేవిధంగా ఇప్పటి నుంచి ఒకే బ్రాండ్‌పై ఎరువుల అమ్మకాలు జరపాలని కేంద్రం నిర్ణయించింది. రాబోయే వానాకాలం సీజన్‌లో రైతులకు సాగు భారం కొంత తగ్గనుంది. పెట్టుబడి వ్యయం తడిసి మోపెడవుతున్న తరుణంలో ఎరువుల ధరలు తగ్గడం రైతన్నకు ఊరట కలిగించే అంశంగా చెప్పుకోవచ్చు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి పదార్థాల ధరలు భారీగా తగ్గడంతో కంపెనీలు ఎరువుల రేట్లను తగ్గించేందుకు సమాయత్తమవుతున్నాయి. ఇప్పటికే కాంప్లెక్స్ 20-20-0-13 రకం ఎరువు ధర రూ.150 తగ్గింది. నెల రోజుల్లో ఎరువుల ధర మరింత తగ్గనున్నట్లు తెలుస్తోంది. బస్తా రూ.1000 వరకు దిగి వచ్చే అవకాశం ఉందని ఎరువుల తయారీ సంస్థలు డీలర్లకు సమాచారం ఇచ్చారు.

గతేడాది భారీగా పెంచి..

గతేడాది కాంప్లెక్స్ ఎరువుల ధరలు భారీగా పెంచారు. 20-20-0-13 రకం బస్తా రూ.850 నుంచి రూ. 1350కు చేరింది. 14-35-14, 28-28-0, 10-26-26 ఎరువుల బస్తా ధర రూ. 1500 వరకు పెరిగాయి. పొటాష్ బస్తా ధర అత్యధికంగా రూ. 1700కు చేరింది. దీంతో రైతులు పొటాష్ వాడకం 70 శాతం తగ్గించారు. ఫలితంగా డీలర్లు పొటాష్‌ను తీసుకురావడానికి వెనకడుగు వేశారు. అక్కడికక్కడ ఎవరైనా ఓ లారీ లోడ్ తెప్పించినా నేటికీ అవి అమ్ముడుపోలేదు. గతేడాది ఆరంభంలో డీఏపీ ధరలను కంపెనీలు రూ.1700 నుంచి రూ.1900 వరకు పెంచాయి. కానీ కేంద్ర ప్రభుత్వం రాయితీ పెంచడంతో కంపెనీలు ధరలు తగ్గించి రూ.1350కి విక్రయించాయి. కాంప్లెక్స్, డీఏపీ ఎరువుల ధరలు ఒకేలా ఉండటంతో రైతులు ఎక్కువగా కాంప్లెక్స్ ఎరువులు వినియోగించారు. అయితే ఈ వానాకాలం సీజన్‌లో ఎరువుల ధరలు భారీగా తగ్గే అవకాశం ఉంది.

ధరలు తగ్గుదల ఇలా...

ఎరువుల ధర తగ్గడంతో రైతులకు ఊరట కలుగుతుంది. యాసంగిలో ఎరువు బస్తా ధర రూ.1,350 ఉండగా.. ప్రస్తుతం రూ.1200కు దిగి వచ్చింది. సాధారణంగా ఎకరానికి రెండు బస్తాల ఎరువు వాడుతారు. అంటే ఒక ఎకరానికి రూ.300 పెట్టుబడి రైతన్నకు తగ్గినట్లవుతుంది. వచ్చే వానాకాలం నాటికి ఎరువు బస్తా ధర రూ.1000 చేరుకునే అవకాశం ఉంది. అంటే ఎకరానికి రూ. 600 పెట్టుబడి తగ్గినట్లే.

ధరల నిర్ణయం ఉత్పత్తిదారులదే..

గతంలో ఎరువుల ధర పెరుగుదల, రాయితీలు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండేవి. నాలుగేళ్ల క్రితం ధరల నిర్ణయాధికారం కంపెనీలకు ఇచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిపదార్థాల ధరల హెచ్చు తగ్గుదలను బట్టి కంపెనీలు ధరలు నిర్ణయిస్తున్నారు. కాంప్లెక్స్, డీఏపీ ఎరువుల తయారీకి అవసరమైన పాస్పరిక్ యాసిడ్, పొటాష్, పాస్పరస్ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటారు. ప్రస్తుతం వాటి ధరలు గణనీయంగా తగ్గడంతో ఎరువుల ధరలు కూడా దిగివచ్చాయి. దీంతో కాంప్లెక్స్ ఎరువు (20-20-0-13) రూ. 1350 ఉండగా నెలకో రూ.50 చొప్పున తగ్గుతూ ప్రస్తుతం రూ.1200కు వచ్చింది. మరో నెలరోజుల్లో అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువు బస్తా (50 కిలోల) ధర రూ.200 నుంచి రూ.300 తగ్గే అవకాశం ఉన్నట్లు సమాచారం. 20-20-0-13 రకం ఎరువును రైతులు అధికంగా వాడుతున్నారు.

2022-23 వానాకాలం, యాసంగిలో వినియోగించిన రసాయన ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)

సీజన్	వానాకాలం	యాసంగి
యూరియా	28,885	25,101
డీఏపీ	47,750	9,297
ఎంఓపీ	9,750	9,297
కాంప్లెక్స్ ఎరువులు	25,750	13,945
ఎస్ఎస్‌పీ	12,250	4648

వన్ నేషన్ వన్ ఫర్టిలైజర్...

కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం కొత్త స్కీంను తీసుకొచ్చింది. వన్ నేషన్ వన్ ఫర్టిలైజర్ స్కీంను తీసుకొచ్చింది. వన్ నేషన్ వన్ ఫర్టిలైజర్ స్కీం కింద ఎరువులను ఒకే బ్రాండ్ కింద విక్రయించాలని నిర్ణయించింది. ఇకపై భారత్ డీఏపీ, భారత్ పొటాష్, భారత్ యూరియా, భారత్ ఎన్‌పీకే (కాంప్లెక్స్‌లన్నీ)ల పేరిట అమ్మకాలు జరగనున్నాయి. వీటి బస్తాలకు వేర్వేరు రంగులు కేటాయిస్తూ డిజైన్లు తయారు చేస్తారు. ఈ బ్రాండ్లు దేశ వ్యాప్తంగా అందుబాటులో ఉంటాయి. ఇకపై వేర్వేరు కంపెనీల పేరుతో ఎరువుల అమ్మకాలు నిలిపివేయాలని కేంద్రం నిర్ణయించింది. వచ్చే వానాకాలం నుంచి కొత్త బస్తాల్లో ఎరువులు వస్తాయి. ఇప్పటికే మొదటి దఫా అక్కడక్కడా కొత్త బస్తాలు ఫర్టిలైజర్ దుకాణాల్లోకి వచ్చాయి.

తగ్గించడం సంతోషకరం..



పెట్టుబడి పెరుగుతున్న తరుణంలో ఎరువుల ధరలు తగ్గించడం చాలా సంతోషకరం. రోజురోజుకు పశు సంపద కూడా తగ్గిపోతుండటంతో పంటల సాగు సమయంలో సేంద్రియ ఎరువు వాడకం తగ్గుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఎరువులు, విత్తనాలు పూర్తిగా సబ్సిడీపై అందించాల్సిన అవసరం ఉంది. ఎరువుల ధరలు తగ్గించడంతో రైతులకు కొంత ఆర్థిక భారం తగ్గిన్నట్లు అవుతుంది.

– మల్లు వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు, మాచన్‌పల్లి, మహబూబ్‌నగర్ రూరల్

ఎరువుల ధరలు తగ్గుతున్నాయి



అన్నిరకాల ఎరువులకు సంబంధించిన ధరలు తగ్గుతూ వస్తున్నాయి. నెలకు రూ.50 చొప్పున బస్తా ధర తగ్గింది. వచ్చే వానాకాలం వరకు మరింత తగ్గే అవకాశం ఉంది. ఎరువుల బస్తాల ధరలు తగ్గడంతో రైతులకు చాలావరకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– కృష్ణారెడ్డి, ఫర్టిలైజర్ వ్యాపారి, భూత్పూర్

హోంగార్డు మృతదేహం లభ్యం


వెంకటేష్ (ఫైల్)

మన్ననూర్: ఈగలపెంట పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్ (40) మృతదేహం మూడురోజుల తర్వాత గురువారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ పర్యటనలో భాగంగా హరిత హోటల్ సమీపంలో బందోబస్తు విధులు నిర్వహించిన తర్వాత కనిపించకుండా పోయాడని అన్నారు. ఈ క్రమంలో రెండు రోజుల పాటు పోలీసులు, ఫైర్, అటవీశాఖ సిబ్బంది గ్రామస్తులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. మన్ననూర్ నుంచి ఉమామహేశ్వరానికి కాలినడకన వెళ్లే దారిలో అటవీశాఖ వారు జంతువుల తాగునీటి కోసం ఉసిల్లకుంటలో ఏర్పాటు చేసిన సోలార్ బోరు మోటారుకు ఉన్న విద్యుత్ సర్వీస్ వైరు తీసుకున్నట్లు, అక్కడే జంతువుల రాకపోకలను గమనించేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఫుటేజీలో వెంకటేష్ కనిపించినట్లు అటవీశాఖ సిబ్బంది ద్వారా తెలిసింది. దీంతో అమ్రాబాద్ సీఐ ఆదిరెడ్డి, ఎస్సైలు వీరబాబు, వీరమల్లుల సమక్షంలో పోలీసులు, హోంగార్డులు గ్రామస్తుల సహాయంతో అటవీ సరిహద్దు ప్రాంతంలో గాలింపు చేపట్టారు. ఈక్రమంలో కుంట సమీపంలో ఓ చెట్టుకు విద్యుత్ వైరుతో ఉరివేసుకుని విగత జీవిగా కనిపించాడు. మృతదేహాన్ని తరలించే పరిస్థితి లేక శవ పంచనామా అక్కడే నిర్వహించి, కేసు నమోదు చేసి అక్కడే పోస్టుమార్టం చేశారు. మృతుడు వెంకటేష్ అమ్రాబాద్ మండలం తిర్మలాపూర్ గ్రామం కాగా భార్య జ్యోతితో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు. వెంకటేష్ మృతికి గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన డీఆర్‌ఎం


రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం శరత్ చంద్రయన్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని రైల్వే స్టేషన్‌ను గురువారం డివిజనల్ రైల్వే మేనేజర్ శరత్‌చంద్రయన్ పరిశీలించారు. రైల్వే ప్లాట్‌ఫాంలు, వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాల్‌ను పరిశీలించారు. మహబూబ్‌నగర్ వరకు పొడిగించిన విశాఖపట్నం -కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 20వ తేదీన జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభిస్తున్న నేపథ్యంలో డీఆర్‌ఎం రైల్వే స్టేషన్‌ను పరిశీలించినట్లు తెలిసింది. కార్యక్రమానికి సంబంధించిన వేదిక, ఏర్పాట్ల గురించి సంబంధించి అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీనియర్ డీఓఎం వెంకన్న, సీనియర్ డీసీఎం బాలాజీ కిరణ్, సీనియర్ డీఈఎన్ అనిల్‌కుమార్, సీనియర్ డీఎంఈ జీషాన్ అహ్మద్, సీనియర్ డీఈఈ మెయింటెనెన్స్ కిరణ్‌కుమార్, సీనియర్ డీఎస్‌టీఈ నీల పావని ఉన్నారు.

ఉప్పొంగిన జలం



రేవల్లి మండలం కేశంపేట సమీపంలో గురువారం ఉదయం ఎయిర్‌వాల్వ్ పైప్ పగిలి నీరంతా ఎగిసిపడింది. స్థానికులు అధికారులకు తెలుపడంతో సరఫరా నిలిపివేయించారు. ఈ విషయాన్ని అధికారుల వద్ద ప్రస్తావించగా ప్రస్తుతం ట్రయల్ రన్ నడుస్తోందని.. సమస్యలు ఎక్కడెక్కడ ఉన్నాయని తెలుసుకుంటున్నామని తెలిపారు. కేశంపేట సమీపంలో ఎయిర్‌వాల్వ్ దగ్గర గ్యాస్‌కిట్ పగిలిందని.. సాయంత్రం వరకు బాగు చేయించామని వివరించారు. – గోపాల్‌పేట

పొలంలో గుర్తుతెలియని మహిళ మృతదేహం

భూత్పూర్: పట్టణ సమీపంలోని ఓ వ్యవసాయ పొలం వద్ద ఉన్న పాడుబడిన బావి వద్ద గురువారం సాయంత్రం గుర్తు తెలియని మహిళ (50) మృతదేహం లభించింది. సమాచారం అందడంతో ఎస్‌ఐ.భాస్కర్‌రెడ్డి, సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని మహిళ బహిర్భూమికి వెళ్లడంతో ఎండ తీవ్రంగా ఉండటం, యాచకురాలు కావడంతో కిందపడిపోయి మృతి చెంది ఉండవచ్చని స్థానికులు, పోలీసులు అనుమానం వ్యక్తంచేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ.భాస్కర్‌రెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ప్రమాదవశాత్తు కారు దగ్ధం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు కారు దగ్ధమైన సంఘటన గద్వాలలో చోటుచేసుకుంది. ఫైర్ సిబ్బంది, కారు యజమాని కథనం ప్రకారం.. పట్టణంలోని భీంనగర్‌కాలనీకి చెందిన హమఉల్లాఖాన్ గురువారం మధ్యాహ్నం సమీపంలోని ఓ హోటల్‌లో భోజనం చేసేందుకు వ్యాగనర్ కారులో వెళ్లాడు. అయితే 15 నిమిషాల వ్యవధిలో కారులోంచి మంటలు వచ్చాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా కాలిపోయి.. రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లిందని కారు యజమాని తెలిపారు.

వరిగడ్డి, పైపులు దగ్ధం


ప్రమాదవశాత్తు కాలిపోయిన వరిగడ్డి

ఉప్పునుంతల: మండలంలోని తాడూరులో గురువారం మధ్యాహ్నం రైతు గుండెమోని ఎట్టయ్యకు చెందిన వ్యవసాయ పొలంలో వరిగడ్డికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైంది. గడ్డితోపాటు పక్కనే ఉంచిన 40 స్ప్రింకర్ల పైపులు, మరో పైపు కాలిపోయి మొత్తం రూ. లక్ష వరకు నష్టం కలిగింది. 5 ఎకరాల పొలంలో ఉన్న వరిగడ్డిని వాముగా నిల్వచేసి ఉంచారు. దాని అంచున బోరు మోటారుకు వరకు ఉన్న విద్యుత్ తీగలు కలువడంతోనే మంటలు చెలరేగి ఉంటాయని బాధిత రైతుతోపాటు పరిసర పొలాలు ఉన్న రైతులు తెలిపారు. ఎగిసిపడుతున్న మంటలను చూసి వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ వచ్చే లోపే గడ్డి, పైపులు పూర్తిగా కాలిపోయాయి. ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్పివేసి పక్క పొలానికి మంటల వ్యాపించకుండా చేశారు.

నేను క్షేమంగానే ఉన్నా..

- నలేశ్వర క్షేత్రంలో అదృశ్యమైన యువతి గాయత్రి
- పోలీసులకు అందిన వీడియో సమాచారం


గాయత్రి

లింగాల: నేను క్షేమంగానే ఉన్నాను కుటుంబ సభ్యులు గాని, బంధువులు గాని ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని సలేశ్వర క్షేత్రంలో అదృశ్యమైన కర్ణాటక యువతీ గాయత్రి అన్న మాటల వీడియో లింగాల పోలీసులకు చేరింది. వీడియోను గురువారం పోలీసులు విడుదల చేశారు. గత ఏప్రిల్ 6న నల్లమల అటవీ ప్రాంతంలోని సలేశ్వర క్షేత్రంలో జరిగిన ఉత్సవాలకు కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు చెందిన గాయత్రి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి అదృశ్యమైన సంఘటన తెలిసిందే. దీంతో అదే నెల 8న యువతి తండ్రి రవీంద్రస్వామి లింగాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి నెల 15 రోజుల పాటు ఈ సంఘటన ఒక మిస్టరీగా మారింది. అయితే యువతి మాట్లాడిన మాటల వీడియో పోలీసులు అందడంతో అదృశ్యం మిస్టరీ కొంత మేరకు తొలగినట్లయింది. నేను క్షేమంగా ఉన్నాను ఎవరు కూడా కలవరపడొద్దు.. నాలుగేళ్ల క్రితం జరిగిన ఓ సంఘటనలో సమాజం తమ కుటుంబాన్ని వెలివేసింది అని యువతి మాటల్లో ఆవేదన వ్యక్తం చేసింది. అప్పటి నుంచి తనలో ఒక రకమైన బాధ ఉండేదని, దానిని దిగమింగుకుంటూ ఇన్నేళ్లు కాలం గడుపుకుంటూ వస్తున్నానని వాపోయింది. తాను చనిపోయేంత పిరికి దానిని కాదని.. ఇంటికి కూడా వెళ్లకుండా సన్యాసం తీసుకుంటానని పేర్కొంది. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం కూడా ఇష్టం లేదని వివరించింది. కాగా రాయచూర్ ఎస్‌ఐ యువతికి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు పోలీసుల ద్వారా తెలిసింది. మరి కొద్ది రోజుల్లో ఈ సంఘటన మిస్టరీ పూర్తిగా తొలగిపోనుందని పోలీసులు తెలిపారు.

ముగిసిన ఈర్ల నర్సింహ అంత్యక్రియలు


అంత్యక్రియలకు హాజరైన సీపీఐ రాష్ట్ర నాయకత్వం తదితరులు

బిజినేపల్లి: సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈర్ల నర్సింహ అంత్యక్రియలు గురువారం బిజినేపల్లి మండలంలోని వెల్గొండ గ్రామంలో నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, రాష్ట్ర నాయకులు చాడా వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి వెంకటేష్ తదితరులు ఈర్ల నర్సింహ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నర్సింహ భార్య (ఎంపీటీసీ) సరోజనమ్మను, వారి కుమారులను, కుటుంబ సభ్యులను సీపీఐ రాష్ట్ర నాయకత్వం ఓదార్చింది. స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కుచుకూళ్ల దామోదర్‌రెడ్డి నర్సింహ మృతదేహానికి నివాళి అర్పించి, వారి కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. అంత్యక్రియల ఊరేగింపులో తెలంగాణలోని పలు జిల్లాలతో పాటు ఉమ్మడి జిల్లా నుంచి నాయకులు, అభిమానులు, ప్రజలు, బంధువులు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు వేల సంఖ్యలో హాజరై కన్నీటి వీడ్కోలు పలికారు. సీపీఐ నాయకులు బాలనర్సింహ, ఆనంద్‌జీ, కృష్ణాజీ, నాయకులు మంగి విజయ్, బంగ్ల నాగిరెడ్డి, కరిగెళ్ల దశరథం, మిద్దె పరశురాములు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూర్‌లో గురువారం మధ్యాహ్నం వివాహిత గోవు రాధిక (25) వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మధ్యాహ్నం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన రాధిక నల్లగొండ జిల్లా మల్లేపల్లి సమీపంలోని తల్గానికుంట గ్రామానికి చెందిన తన తమ్ముడు పరమేష్‌కు ఫోన్‌చేసింది. తాను చనిపోతున్నట్లు అక్కడే ఉన్న తన కుమారుడితో మాట్లాడించాలని కోరింది. దాంతో పరమేష్ వెంటనే తనకు తెలిసిన వెల్టూరుకు చెందిన శ్రీకాంత్‌కు ఫోన్‌చేసి విషయం చెప్పి తొందరగా పొలం వద్దకు వెళ్లాలని సూచించాడు. శ్రీకాంత్ పొలం వద్దకు వెళ్లగా అప్పటికే రాధిక చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. అతను విషయాన్ని కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు తెలియజేశాడు. మృతురాలికి భర్త ప్రకాశ్, కుమారుడు, కూతురు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఇంట్లో గొడవపడి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు.

మైనర్‌ను పెళ్లాడిన వ్యక్తి

- పోలీసుల అదుపులో బాలిక
- పరారీలో నిందితుడు


మక్తల్: మైనర్ బాలికను ఓ వ్యక్తి పెళ్లి చేసుకున్న సంఘటన మక్తల్ మండలంలో చోటుచేసుకుంది. ఆ వివరాలు.. ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికకు(17) మాయమాటలు చెప్పి, పూజారి రాజు సన్నిహితంగా మెలుగుతూ ఉండేవాడు. ఈనెల 14న ఇంట్లో నుంచి తీసుకెళ్లి రహస్యంగా పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయమై బాలిక తల్లిదండ్రులు మక్తల్ పోలీసులను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన పోలీసులు బాలికను కాపాడి నారాయణపేటలోని సఖి కేంద్రానికి తరలించారు. నిందితుడు పూజారి రాజు కోసం గాలిస్తున్నారని మక్తల్ సీఐ సీతయ్య తెలిపారు. కాగా రాజుకు వివాహమైంది. భార్యతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కోతల్లేని కరెంట్..

రాష్ట్రంలో ఇదివరకెన్నడూ లేనంతగా పెరిగిన వినియోగం

రోజుకు 248 మిలియన్ యూనిట్లు దాటిన వాడకం

- గత ఏడాది కంటే 27.51 శాతం అధిక డిమాండ్
- అయినా ఎక్కడా కోతల్లేకుండా నిరంతరాయంగా సరఫరా
- సీఎం జగన్ ముందుచూపు వల్లే ఇది సాధ్యం
- డిమాండ్ పెరిగి.. సాంకేతిక కారణాల వల్లే అక్కడక్కడ ట్రిప్
- నిమిషాల వ్యవధిలో సరిచేస్తున్న అధికారులు, సిబ్బంది
- గత ప్రభుత్వ హయాంలో కరెంట్ కోతలతో అల్లాడిన ప్రజలు
- అధికారికంగానే గంటల తరబడి కోతలు
- ఆ రోజులు మరిచి దుష్ప్రచారం చేస్తున్న ఎల్లో మీడియా


విద్యుత్ వెలుగుల్లో విజయవాడ

నాడు చీకటి రోజులు

గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 'పట్టణాల్లో ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు.. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు.. గ్రామీణ ప్రాంతాల్లో అయితే పగలంతా విద్యుత్ సరఫరా ఉండదు' అని అధికారికంగా ప్రకటనలు జారీ అయ్యేవి. 'ఎండా కాలం కదా.. పవర్ కట్ మామూలే' అని అప్పటి పాలకులు దబాయించే వారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో ఎవరికీ తెలిసేది కాదు. వంటింట్లో మిక్సీలు తిరక్క గృహిణులు, హాల్లో ఫ్యాన్ తిరక్క పిల్లలు, ఆఫీసుల్లో ఏసీలు పనిచేయక ఉద్యోగులు, జిరాక్స్ సెంటర్ల వద్ద విద్యార్థుల పాట్లు అన్నీ ఇన్నీ కాదు. విద్యుత్ ఎప్పుడొస్తుందా అని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూడాల్సి వచ్చేది. ఆ రోజులను గుర్తు చేస్తే చాలు ప్రజలు కథలు కథలుగా చెబుతారు.

నేడు వెలుగు జిలుగులు

ఎక్కడా 'విద్యుత్ కోత' అన్న పదానికి తావు లేకుండా సీఎం వైఎస్ జగన్ ముందుచూపుతో వ్యవహరించారు. గృహాలకు, పరిశ్రమలకు, వ్యవసాయానికి ఏ రీతినా సమస్య లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం బొగ్గు నిల్వలు సరిపడా ఉండేలా చూసుకోవడంతోపాటు బయటి మార్కెట్‌లోనూ విద్యుత్ కొనుగోలు చేశారు. సరఫరాలో నాణ్యత పెరిగేలా వ్యవస్థాగత మార్పులు చేశారు. ఈ ఏడాది ఇదివరకెన్నడూ లేనంతగా అనూహ్యంగా డిమాండ్ పెరగడంతో అక్కడక్కడ ఓవర్‌లోడ్‌తో ట్రిప్ కావడం తప్పించి ఏ సమస్యా లేకుండా శ్రద్ధ పెట్టారు. అలాంటి చోట్ల నిమిషాల వ్యవధిలోనే మరమ్మతులు చేసేలా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు. తద్వారా ఇళ్లలో, కార్యాలయాల్లో ఎక్కడా 'విద్యుత్ కోత' అన్న మాటే వినిపించడం లేదు. ఫ్యాన్లు, ఏసీలు, ఫ్రిజ్‌లు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి.

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఇదివరకెన్నడూ లేని విధంగా విద్యుత్ డిమాండ్ పెరిగినప్పటికీ, ఎక్కడా కోతలన్నదే లేకుండా సరఫరా సవ్యంగా సాగుతోంది. ఆర్థిక కార్యకలాపాలు గణనీయంగా పెరగడం, ఎండలు మండిపోతుండటం వల్ల విద్యుత్ వినియోగం అమాంతం పెరిగింది. అయినా కాసేపు కూడా విద్యుత్ కోత లేకుండా నిరంతరాయంగా సరఫరా జరిగేలా సీఎం వైఎస్ జగన్ ముందుచూపుతో వ్యవహరించారు. గత సంవత్సరం గరిష్ట డిమాండ్‌తో పోలిస్తే ఇప్పుడు 27.51 శాతం అధికంగా ఉంది. ఉష్ణోగ్రత 46 డిగ్రీలు దాటుతోంది. దీంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. ఫలితంగా ఇంట్లో ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు వంటి గృహోపకరణాలు నిరంతరం పనిచేస్తున్నాయి. ఎక్కువ సమయం ఇంట్లోనే గడపడం వల్ల మిక్సీలు, గ్రైండర్లు, టీవీలు, కంప్యూటర్ల వినియోగం కూడా అధికంగానే ఉంటోంది. మరోవైపు పారిశ్రామిక వినియోగం కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో విద్యుత్ వినియోగం రాకార్డు స్థాయిలో పెరిగిపోయింది. రోజువారీ డిమాండ్ 248.985 మిలియన్ యూనిట్లుగా నమోదవుతోంది. గత ఏడాది ఇదే సమయానికి 195.266 మిలియన్ యూనిట్లుగా ఉండింది. రోజులో పీక్ డిమాండ్ 12,482 మెగావాట్లుగా ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 9,308 మెగావాట్లు మాత్రమే. అంటే 34.10 శాతం పెరిగింది. పగటి పూట సగటు పీక్ డిమాండ్ 10,374 మెగావాట్లు, సాయంత్రం వేళల్లో 9,582 మెగావాట్లకు చేరుకుంది. అయినప్పటికీ గృహ, వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య విద్యుత్‌కు ఇబ్బంది లేకుండా, డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ సంస్థలు నిరంతరం కరెంట్ సరఫరా చేస్తున్నాయి. ఇలా దేశంలోనే ఎక్కడా జరగడం లేదని, రాష్ట్రం అభివృద్ధిపథంలో పయనిస్తోందని చెప్పడానికి ఇదొక పెరామీటర్‌గా చెప్పవచ్చని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు.

ముందుచూపుతో విద్యుత్ కొనుగోలు

ప్రస్తుతం ఏపీజెన్కో థర్మల్ నుంచి 89.981 మి.యూ, ఏపీ జెన్‌కో హైడల్ నుంచి 5.414 మి.యూ, సెంట్రల్ జెనరేటింగ్ స్టేషన్ల నుంచి 43.012 మి.యూ, సెయిల్, హెచ్‌పీసీఎల్, గ్యాస్ వంటి ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్ల నుంచి 28.510 మి.యూ, సోలార్ నుంచి 25.605 మి.యూ, విండ్ నుంచి 11.591 మి.యూ, ఇతర మార్గాల్లో 1.496 మిలియన్ యూనిట్ల చొప్పున విద్యుత్ సమకూరుతోంది. అయితే ఇది మాత్రమే సరిపోవడం లేదు. దీంతో బహిరంగ మార్కెట్ నుంచి యూనిట్ సగటు రేటు రూ.7.537 చొప్పున రూ.33.936 కోట్లతో 45.023 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ప్రతిరోజూ కొనుగోలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఈవిధంగా డిమాండ్‌ను అందుకోలేక భారీగా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. జార్ఖండ్‌లో 4.62 మి.యూ, హర్యానాలో 2.64 మి.యూ, ఉత్తరప్రదేశ్‌లో 2.03 మి.యూ, కర్ణాటకలో 1.97 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఏర్పడింది.

కోతల్లేకుండా ఇదే ప్రథమం

మాది పాలిమర్ ప్రాసెసింగ్ యూనిట్. రోజుకు 500 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగిస్తుంటాం. అయినప్పటికీ ఈ వేసవిలో ఏ రోజూ విద్యుత్ కొరత రాలేదు. ఏపీఈపీడీసీఎల్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నారు. ఫలితంగా ప్రొడక్షన్ ఆగడం లేదు. గతంలో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉండేవి. గంటల తరబడి మెషీన్లు ఆపితే తిరిగి అవి వేడెక్కేందుకు చాలా సమయం పట్టేది. మధ్యలో ఆగిపోవడం వల్ల సరుకు పాడయ్యేది. అందువల్ల ఆర్థికంగా చాలా నష్టపోయేవాళ్లం. ఇప్పుడు ఆ బాధలే లేవు. – ఐ.సురేష్ బాబు, పారిశ్రామికవేత్త, విశాఖపట్నం జిల్లా

ఇప్పుడు ఆ పరిస్థితి లేదు

నేను 300 ఎకరాల చెరువుల్లో చేపలు, రొయ్యలు సాగు చేస్తున్నాను. ఏమాత్రం విద్యుత్ సరఫరా ఆగినా చాలా ఇబ్బంది పడిపోతాం. గతంలో అలాగే చాలా నష్టపోయాం. అప్పట్లో కరెంటు కోతలు ఎక్కువగా ఉండేవి. జనరేటర్లు పెట్టుకునే వాళ్లం. డీజిల్ మోటార్లతో నీరు తోడుకునేవాళ్లం. దానివల్ల పెట్టుబడి ఖర్చులు ఎక్కువయ్యేవి. చేతికొచ్చేది ఏమీ ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఆక్వాకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌ను సబ్సిడీతో అందించడంతో పాటు విద్యుత్ కోతలు లేకుండా మా వంటి రైతులకు మేలు చేస్తోంది.
– ముంగర నరసింహారావు, ఆక్వా రైతు, ఆకివీడు, పశ్చిమగోదావరి జిల్లా

గత ప్రభుత్వ హయాంలో కోతలిలా

ఏడాది	మిలియన్ యూనిట్లు
2014-15	2202.07
2015-16	20.98
2016-17	34.89
2017-18	10.06
2018-19	6.50
2019-20	36.11

వాస్తవాలు మరచి దుష్ప్రచారం

ఎక్కడా విద్యుత్ కోతలు లేకపోయినప్పటికీ చంద్రబాబుకు లబ్ధి చేకూర్చేలా ఎల్లో మీడియా తప్పుడు రాతలు రాస్తోంది. గత చంద్రబాబు ప్రభుత్వం హయాంలో విద్యుత్ సరఫరా దుస్థితిని వ్యూహాత్మకంగా విస్మరిస్తోంది. గంటల తరబడి కోతలు విధించారనే విషయాన్ని దాస్తోంది. అప్పట్లో వేసవిలో కరెంటు పరిస్థితి చెప్పనలవి కాదు. వేసవిలో కాకుండా కూడా కోతలు విధించిన రోజులున్నాయి. పరిశ్రమలకైతే ఏకంగా పవర్ హాలిడేలు ఇచ్చారు. వారంలో మూడు రోజులు పరిశ్రమలన్నింటికీ తాళం వేయాల్సి వచ్చేది. జిరాక్స్ మెషీన్లు, పిండి మరలు, కూల్ డ్రింక్స్ దుకాణాలు, కూలింగ్ వాటర్ ప్లాంట్లు గంటల తరబడి పని చేయక చిరు వ్యాపారులు నష్టాలు చవిచూశారు. విద్యుత్ కోతల గురించి మాట్లాడితే అప్పటి ప్రభుత్వ పెద్దలు, మంత్రులు దబాయించే వారు. ఈ సమస్యలన్నింటికీ చెక్ పెడుతూ సీఎం జగన్ ప్రభుత్వం కోత అన్నదే లేకుండా విద్యుత్ సరఫరా చేస్తుంటే ఎల్లో మీడియాకు కడుపు మండుతోంది. వంకర బుద్ధి చూపిస్తూ.. చిన్న చిన్న సాంకేతిక కారణాలతో విద్యుత్ పోయిన ప్రాంతాలను చూపుతూ దుష్ప్రచారం చేస్తోంది.

'గుండెపోటు' మాటే లేదు

ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం

- సీబీఐ ఎస్పీ నన్ను కలిసినప్పుడు ఆ పదమే చర్చకు రాలేదు
- నేను చెప్పని అంశాలను చెప్పినట్లు ఆంధ్రజ్యోతి ఎలా రాస్తుంది?
- జర్నలిజం దిగజారుడుతనానికి పరాకాష్ట అంటే ఇదే



"నేను సీబీఐ ఎస్పీకి చెప్పని వాటిని కూడా చెప్పినట్లుగా ఆంధ్రజ్యోతి కథనాలను ప్రచురించడం దిగజారుడు జర్నలిజానికి పరాకాష్ట. వైఎస్ వివేకానందరెడ్డి గుండెపోటుతో మృతి చెందారని వైఎస్ జగన్ నాతో అన్నారని నేను సీబీఐకి వెల్లడించినట్లు వెలువడ్డ కథనం పచ్చి అబద్ధం" – అజేయ కల్లం

సాక్షి, అమరావతి: మేనిఫెస్టో కమిటీ సమావేశానికి, హత్య కేసుకు సంబంధం ముడిపెడుతూ కథనాలను ప్రచురించటాన్ని బట్టి ఆంధ్రజ్యోతి ఏ స్థాయికి దిగజారిందో అర్థం అవుతోందని ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం వ్యాఖ్యానించారు. వైఎస్ వివేకా గుండెపోటుతో మృతి చెందినట్లు వైఎస్ జగన్ తనకు చెప్పారంటూ ఆంధ్రజ్యోతి ప్రచురించిన వార్త పచ్చి అబద్ధమని అజేయ కల్లం ఖండించారు. అంతకుముందే మేనిఫెస్టో కమిటీ సమావేశం జరిగిందని, అందులో పాల్గొన్న వారిని విచారించాలంటూ గతంలో ఓ కథనం వెలువరించిందని, అందులో భాగంగానే మళ్లీ పచ్చి అబద్ధాలను ప్రచురించిందన్నారు. ఏదో ఒకవిధంగా ముఖ్యమంత్రి జగన్ పేరును లాగాలనే ప్రయత్నం మినహా ఆంధ్రజ్యోతి కథనాల్లో వాస్తవాలు లేవని స్పష్టం చేశారు. సీబీఐ తనను విచారించిందంటూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తను గురువారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అజేయ కల్లం తీవ్రంగా ఖండించారు. కొద్దిరోజుల క్రితం సీబీఐ ఎస్పీ తన ఇంటికి వచ్చి ఐదు నిమిషాలు మాట్లాడి సమాచారం తీసుకున్నారని, ఆ సమయంలో గుండెపోటు అంశం చర్చకే రాలేదని, దాని గురించి అడగలేదని అజేయ కల్లం వెల్లడించారు. వైఎస్ వివేకానందరెడ్డి మృతి చెందిన రోజు యాధృచ్ఛికంగా పార్టీ మేనిఫెస్టో కమిటీ సమావేశం జరుగుతోందన్నారు. సమావేశం జరుగుతుండగా కొంతసేపటికి 'వివేకానందరెడ్డి గారు నో మోర్..' అని ఇంగ్లిష్‌లో చెప్పడంతో ఇక లేచి వచ్చేశామన్నారు. అదే విషయాన్ని సీబీఐ ఎస్పీకి చెప్పానన్నారు. 'మీరు స్వచ్ఛందంగా అంగీకరిస్తే రికార్డు చేసుకుంటామని సీబీఐ ఎస్పీ కోరారు. సెక్షన్ 161 కింద సమాచారాన్ని అడిగారు. అయితే ఆ సమాచారం, రికార్డుకు న్యాయపరమైన విలువ ఉండదు. సంతకాలు తీసుకోలేదు' అని కల్లం పేర్కొన్నారు.

గుండెపోటు మాటే చర్చకు రాలేదు..

అసలు గుండెపోటు అనే పదమే సీబీఐ ఎస్పీని కలుసుకున్న సందర్భంగా చర్చకు రాలేదని అజేయ కల్లం స్పష్టం చేశారు. కేసు దర్యాప్తులో ఉన్న సమయంలో రహస్యంగా ఉండాల్సిన తమ ఇద్దరి సంభాషణ సమాచారం లీకుల పేరుతో ఆంధ్రజ్యోతిలో రావడం అంటే సీబీఐ విశ్వసనీయత కూడా దెబ్బతిన్నట్లేనని పేర్కొన్నారు. ఇది సీబీఐ పేరును దుర్వినియోగం చేయడమే అవుతుందన్నారు. 'మేనిఫెస్టో కమిటీ సమావేశంలో ఆ పనిమీద దృష్టి పెడతాం కానీ గడియారం చూసుకుంటూ కూర్చోం కదా! ఎవరు ఎప్పుడు బయటకు వెళ్లారో ఎలా తెలుస్తుంది? అయినా ఈ సమావేశాన్ని సీరియస్ మర్డర్ కేసుకు ముడిపెట్టి ఆంధ్రజ్యోతి తనకు కావాల్సినట్లు రాసుకోవడం కంటే అనైతికం మరొకటి ఉండదు..' అని కల్లం మండిపడ్డారు.

ఖండించాల్సిన బాధ్యత సీబీఐపై ఉంది

తన దగ్గర నుంచి తీసుకున్న సమాచారం చార్జిషీటు వేసేవరకు రహస్యంగా ఉండాలని, లీకుల పేరుతో తప్పుడు సమాచారం మీడియాలో ప్రచురితమైనందున ఆ వార్తను ఖండించాల్సిన బాధ్యత సీబీఐపై ఉందని కల్లాం పేర్కొన్నారు. తప్పుడు సమాచారంతో మీడియాలో సమాంతర దర్యాప్తు జరగకూడదని, ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలు మీడియాకు వివరాలు వెల్లడించరాదని సుప్రీం కోర్టు తీర్పులున్నాయని కల్లం ప్రస్తావించారు.

నా భార్యకు కూడా తెలియదు..

'దర్యాప్తు అంశాలను ఇష్టానుసారం ప్రచురించేందుకు, మీడియా తమ ఇష్టం అనేందుకు వీల్లేదని సుప్రీంకోర్టు తాజా తీర్పులున్నాయి. కనీస క్రమశిక్షణ, కోడ్ ఆఫ్ కాండక్ట్ మీడియాకు అవసరం. నేను సీబీఐ ఎస్పీకి చెప్పని అంశాలను చెప్పినట్లుగా నా ఫొటోతో పెద్ద శీర్షిక పెట్టి కథనాలు ప్రచురించటాన్ని బట్టి ఆ పత్రిక ఏ స్థాయికి దిగజారిందో తెలుస్తోంది. ఆ సమయంలో నేను, సీబీఐ ఎస్పీ మాత్రమే ఉన్నాం. మా ఇంటికి సీబీఐ ఎస్పీ వచ్చిన విషయం నా భార్యకు కూడా తెలియదు. ఆంధ్రజ్యోతిలో తప్పుడు వార్త ప్రచురించిన తరువాతే మిగతా వారికి తెలిసింది' అని కల్లం తెలిపారు. తప్పుడు వార్తపై తగిన సమయంలో చర్యలు తీసుకుంటా' అని చెప్పారు.

సమాంతర విచారణ తగదు..

ఏదైనా క్రిమినల్ కేసు దర్యాప్తు జరుగుతున్నప్పుడు దానికి సమాంతరంగా విచారణను ప్రభావితం చేసేలా మీడియా కథనాలను రాయకూడదు, చర్చలు పెట్టకూడదు. దర్యాప్తు సమయంలో విచారణాధికారికి సాక్షులు వెల్లడించిన అంశాలను చార్జిషీట్ వేసేవరకు బహిర్గతం చేయకూడదు. విచారణలో వెల్లడైన అంశాలను బహిర్గతం చేస్తూ కథనాలను ప్రచురిస్తే వ్యక్తిగత స్వేచ్ఛను హరించినట్లేనని పలు కేసుల్లో సుప్రీంకోర్టు, హైకోర్టులు తీర్పులిచ్చాయి. దీన్ని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కూడా స్వాగతించింది' అని కల్లం చెప్పారు.

ప్లాట్ల వివాదంపై ఆర్డీఓ విచారణ



కల్వకుర్తి: పట్టణంలోని సర్వే నం.743లో గల జాతీయ రహదారి హైదరాబాద్- నంద్యాల రోడ్డు విస్తరణ కోసం ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. అయితే అంతకు ముందే వెంచర్ వేయగా చాలామంది ప్లాట్లు కొనుగోలు చేశారు. ఈ ప్లాట్ల గుండా రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని, ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. ఇందులో ఏడుగురు తమ పేర్లు లేవని తమకు నోటీసు అందలేదని ఆర్డీఓ రాజేశ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఆర్డీఓ రాజేశ్‌కుమార్ ప్లాట్లు కొనుగోలు చేసినవారందరి సమక్షంలో నేషనల్ హైవే, భూసేకరణ అధికారుల సమక్షంలో సమగ్ర విచారణ జరిపారు. ప్లాట్లు నష్టపోయే వారందరికీ నిబంధనల ప్రకారం ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని, ఫిర్యాదు చేసిన వారిలో కొంత మందికి సంబంధించిన ప్లాట్లు అందులో పోవడం లేదని ఆర్డీఓ స్పష్టం చేశారు. రోడ్డు విస్తరణకు ప్రభుత్వ కార్యక్రమాలకు ఆటంకం కల్పించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలయంలో హుండీ చోరీ

అమరచింత: పట్టణంలోని బీసీకాలనీలో ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో హుండీ చోరీకి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ధ్వజస్తంభ ఏర్పాటు కోసం భక్తులు సమర్పించిన నగదు సుమారు రూ.60 వేలు ఎత్తుకెళ్లినట్లు ఆలయ నిర్వాహకురాలు, విశ్రాంత ఉపాధ్యాయురాలు కోటకొండ నర్సమ్మ తెలిపారు. ఆమె కథనం మేరకు.. 1996లో తన భర్త కోటకొండ చిన్న శ్రీనివాసులు తన స్థలంలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని నిర్మించారన్నారు. ప్రస్తుతం ఇంటితో పాటు ఆలయ మరమ్మతులను పట్టణానికి చెందిన మేస్త్రీ రామకృష్ణ అయిదు నెలలుగా చేపడుతున్నారు. వారం కిందట ఆలయ తలుపుల తాళం విరగ్గొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. విషయం తెలియడంతో మేస్త్రీని పిలిపించి అడగగా తనవద్ద పనిచేస్తున్న నర్సింహ ఎత్తుకెళ్లాడని చెప్పారు. హుండీలోని డబ్బులు కావాలని అడుగగా మూడు రోజుల కిందట రూ.1,300 తెచ్చి ఇచ్చారని వివరించారు. మిగిలిన డబ్బులు ఇవ్వకుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

ప్రజల కోసం నిరంతర పోరాటం


రుక్కంపల్లిలో భట్టి విక్రమార్కకు మద్దతు తెలుపుతున్న గద్దర్

- భట్టి పాదయాత్రకు గట్టి మద్దతు
- ప్రజా యుద్ధ నౌక గద్దర్

నవాబుపేట: బుల్లెట్ దిగి బాడీలో ఉంది.. అయినా భయపడేది లేదు.. ప్రజల కోసం నిరంతర పోరాటం చేస్తానని ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్నారు. ప్రజల కోసం చేస్తున్న పోరాటంలోనే గతంలో తనను అంతం చేయాలని భావించిన దుండగులు బుల్లెట్ల వర్షం కురిపించారు.. చావు నోట్లో తలపెట్టి బయటికి వచ్చా.. ఇంకా బుల్లెట్ బాడీలో ఉన్న భయం లేకుండా పోరాటం చేస్తున్నా.. మన నీళ్లు.. మన నిధులు, నియామకాల కోసం పోరాడితేనే వెంట నడిచాం.. తెలంగాణ సాధించుకున్నాం. కానీ, పేదలకు ఇచ్చిన భూములు లాక్కుంటే చూస్తూ ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర గురువారం మండలంలోని రుక్కంపల్లిలో చేరుకోగా.. గద్దర్ కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.వేలాది కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కేసీఆర్ పెద్ద పెద్ద కంపెనీల పేరుతో ధారాదత్తం చేస్తున్నారని, వాటిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ సంపదను అమ్మకానికి పెట్టిన వారికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న వారందరికి తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని, అందుకే భట్టికి గట్టి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణ సాధనలో అమరులైన వారి కుటుంబాలకు భరోసా ఇవ్వకుండా సీఎం కేసీఆర్ నియంత పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా గద్దర్ పలు పాటలు పాడించి అలరించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, ఎంపీటీసీల సంఘం నాయ కులు రామచంద్రయ్య, డీసీసీ ప్రధాన కార్యదర్శి బంగ్ల రవి, చౌడూర్ సర్పంచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ లేనట్టేనా?

- ఆర్డీఎస్, జూరాల రీడిజైన్ చేస్తాం
- ప్రతి ప్రభుత్వ సబ్సిడీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఇంటికే
- పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ చిన్నారెడ్డి


మాట్లాడుతున్న చిన్నారెడ్డి

వనపర్తి టౌన్: పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్, ఏదుల, వట్టెం, ఉదండాపూర్ వరకు పనులు సాగుతుంటే, లక్ష్మీదేవిపల్లి వద్ద రిజర్వాయర్, కాల్వలు లేకుండా పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు ఎలా పూర్తవుతుందని పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి ప్రశ్నించారు. గురువారం సాయంత్రం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. కొత్త సచివాలయంలో సీఎం కేసీఆర్ చేపట్టిన తొలి సమీక్షలో లక్ష్మీదేవిపల్లి ప్రస్తావన లేనప్పుడు, అక్కడ రిజర్వాయర్ కట్టే ఆలోచన బీఆర్ఎస్‌కు లేనేట్లే అర్థం అవుతుందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో రంగారెడ్డికి, పాలమూరులోని కొన్ని ప్రాంతాలకు నీళ్లు ఇవ్వకుండా నల్లగొండకు తరలించేందుకు చూస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటకలో కాంగ్రెస్ రావడంతో తెలంగాణలోనూ అదే ఫలితాలు వస్తాయన్నారు. ఆర్డీఎస్‌లో రాష్ట్రానికి కేటాయించిన 16 టీఎంసీల వాటాను, జూరాల ప్రాజెక్టు కింద 18 టీఎంసీల నీటిని వాడుకుంటామని, ఇందుకు రాష్ట్రంలో కాంగ్రెస్ వస్తే కర్ణాటక ప్రభుత్వాన్ని ఒప్పించి ఆర్డీఎస్, జూరాలను రీడిజైన్ చేస్తామన్నారు ఆర్డీఎస్ కింద లక్ష 60 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, 87వేల ఎకరాలకు నిర్ధారణ చేసి 50వేల ఎకరాలకే నీళ్లు అందుతున్నాయన్నారు. 18 టీఎంసీల సామర్థ్యం కలిగిన జూరాలో 12 టీఎంసీలకే ప్రాజెక్టు పరిమితమైందని, కర్ణాటకను ఒప్పించి 18 టీఎంసీలు వాడుకుంటూ, లక్ష80వేల ఎకరాలకు నీళ్లు వస్తాయన్నారు. 2005లో రూ.5వేల కోట్లతో పాలమూరులో బీమా, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, కల్వకుర్తి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, 90శాతం పనులు నాలుగేళ్లలో కాంగ్రెస్ పూర్తి చేసిందని, 2019లో పూర్తి చేస్తామన్న పాలమూరు ప్రాజెక్టు ఇప్పటి వరకు ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. మంత్రి నిరంజన్‌రెడ్డి పాలమూరులో సాగునీటికి కాంగ్రెస్ కారణమని గుర్తించాలని, బీఆర్ఎస్ అన్యాయమే చేసిందన్నారు.

ప్రతి సబ్సిడీ నిరంజన్‌రెడ్డి ఇంటికే

రైతులకు ఇచ్చే ట్రాక్టర్, పాక్లెయిన్, హైలెవల్ మిషనరీతో పాటు ప్రతి సబ్సిడీ నిరంజన్‌రెడ్డి ఇంటికే వెళ్తుందని ఆరోపించారు. జిల్లాలో సహజసంపదను కొల్లగొడుతున్నారని, ఇసుక, మట్టి, ఒండ్రు మట్టిని, గుట్టలను వదలడం లేదని మండిపడ్డారు. కల్వకుర్తి ప్రాజెక్టు కింద వైఎస్సార్‌ను ఒప్పించి వనపర్తిని చేర్పించామన్నారు. బీఆర్ఎస్ వచ్చాకా 25టీఎంసీలు ఉన్న కల్వకుర్తిని 40టీఎంసీలకు పెంచేలా తానే కృషి చేశానని, ఇదే విషయం మాజీ మంత్రి జూపల్లి కూడా చెప్పారని వివరించారు. కల్వకుర్తి ప్రాజెక్టు కింద వనపర్తిలోని బుద్దారం, ఘనపురానికి నీళ్లు తెచ్చింది తానే అన్నారు. సమావేశంలో సయ్యద్ అఖ్తర్, ఖమ్మర్ మియ్యా, అనీస్, నరహరి, నారాయణ, యాదయ్య, బాబా, వెంకటేశ్వర్‌రెడ్డి, మధుగౌడ్, భాస్కర్, జాన్ పాల్గొన్నారు.

రమేష్‌బాబుకు పురస్కారం

కందనూలు: ప్రముఖ తెలంగాణ సినీ చారిత్రక పరిశోధకుడు హెచ్.రమేష్‌బాబు రాసిన 'లోటస్ ఫిలిం కంపెనీ హైదరాబాద్' 2022 సంవత్సరానికిగాను ఉత్తమ పరిశోధన గ్రంథం పురస్కారానికి ఎంపికైందని నెలపాడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, గౌరవ అధ్యక్షుడు కందికొండ మోహన్, కార్యదర్శి వహీద్‌ఖాన్, కల్వకోల్ మద్దిలేటి, ఎదిరెపల్లి కాశన్న, వెంకట్‌పవార్ తదితరులు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో తెలుగులో మొదటిసారిగా మూకీల చరిత్రను పరిశోధించి 125 ఏళ్ల చరిత్రను వెలికితీసినందుకుగాను పురస్కారానికి ఎంపిక చేశారని తెలిపారు. ఈ నెల 26న తెలంగాణ సారస్వత పరిషత్తు, బొగ్గులకుంట, హైదరాబాద్‌లో ఈ పురస్కారం అందజేస్తారని పేర్కొన్నారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి ఇస్తున్న ఇన్‌ఫ్లోలు స్వల్పంగా వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం ప్రాజెక్టుకు ఎగువ నుంచి కేవలం 989 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నటుల పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6.731 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 144 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

తాగునీటి కోసం 20 క్యూసెక్కులు

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో గురువారం పూర్తి నీటి మట్టం 1,020 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వలకు ఎలాంటి ఫ్లో లేదు. రామన్‌పాడు నుంచి ఎన్‌టీఆర్ కాల్వ నీటిని నిలిపివేసారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి

- బీసీ పొలిటికల్ జేఏసీ ఛైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్


పలుగురాళ్ల గుట్టపై తవ్వకాలను పరిశీలిస్తున్న యుగంధర్‌గౌడ్

అడ్డాకుల: మండల కేంద్రంతో పాటు కాటవరం శివారులో ఉన్న పలుగురాళ్ల గుట్టపై కొనసాగుతున్న అక్రమ మైనింగ్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన గుట్టపైకి వెళ్లి తవ్వకాలను పరిశీలించి మాట్లాడారు. అడ్డాకుల శివారు సర్వేనంబర్ 161, కాటవరం శివారుసర్వేనంబర్ 95లో పలుగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నాయని.. ఇందుకు మైనింగ్‌శాఖ అనుమతి ఒక్కటే సరిపోదని, చాలా శాఖల అనుమతులు తీసుకోవాల్సి ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ చేయడంతో గుట్ట సమీపంలో ఉన్న ఇళ్లు దెబ్బతింటున్నాయని.. అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ఖనిజ సంపదను కాంట్రాక్టర్లకు దోచి పెడుతున్నారని ఆరోపించారు. అక్రమ తవ్వకాలు కొనసాగుతుండగా మామూళ్ల మత్తులో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మండల కన్వీనర్ శేఖర్‌గౌడ్, కొత్తకోట మండల కన్వీనర్ అంజన్న యాదవ్, రమేష్‌సాగర్ తదితరులు ఉన్నారు.

రగులుకున్న రైల్వేగేటు సమస్య


దేవరకద్రలో రైల్వేగేటు తెరవాలని నినాదాలు చేస్తున్న యువకులు

- పార్టీలకు అతీతంగా ధర్నా
- పట్టణంలో యువకుల నిరసన ర్యాలీ

దేవరకద్ర: పట్టణంలో రైల్వే గేటు సమస్య అగ్గిలా రగులుకుంది. గేటుకు అటు, ఇటు రెండు భాగాలుగా ఉన్న పట్టణం ఇప్పుడు మూసి వేయడంతో రెండుగా విడిపోయింది. దీంతో పట్టణంలోని వ్యాపారులు, అన్ని పార్టీల నాయకులు గురువారం బంద్‌కు పిలుపునిచ్చారు. యువకులు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. నాయకులు, వ్యాపారులు రాయచూర్ రోడ్డు పక్కన ధర్నాకు దిగారు. సీఐ రజితారెడ్డి, ఎస్ఐ వెంకటేష్‌తో పాటు పోలీసు బలగాలు మోహరించాయి. ఆందోళన విరమించాలని పోలీసులు పలుమార్లు నాయకులకు విజ్ఞప్తి చేశారు. సమస్య రైల్వే అధికారులే పరిష్కరిస్తారని వారితో మాట్లాడాలని పోలీసులు సూచించారు. రాస్తారోకో చేపట్టడానికి ప్రయత్నించగా పోలీసులు నివారించారు. ధర్నాలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌గౌడ్, ఎంపీపీ రమాదేవి, సర్పంచ్ విజయలక్ష్మీ, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, కొండ శ్రీనివాస్‌రెడ్డి, చల్మారెడ్డి, రాందాసు, దేవన్న, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర్వులు వచ్చిన వెంటనే..

ఒక పక్క ఆర్వోబీని ప్రారంభించారని పట్టణ ప్రజలతో పాటు వాహనదారులు సంబర పడిపోతున్న తరుణంలో పట్టణానికి అటు ఇటు వారధిగా ఉన్న గేటును అకస్మాత్తుగా మూసివేయడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు, అలాగే గేటు వద్ద ట్రాఫిక్ సమస్య నియంత్రణ కోసం ఆర్వోబీ తప్పనిసరి అవసరం అయితే పట్టణ ప్రజలకు అటు ఇటు తిరగడానికి గేటు కూడా అవసరమే. కానీ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆర్వోబీ ప్రారంభం కావడం వల్ల గేటును మూసి వేస్తున్నట్లు బుధవారం ఉదయం ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే సాయంత్ర నుంచి గేటును మూసి వేశారు.

ఆర్టీసీ బస్సులకు ఇబ్బందులు..

రైల్వే గేటును మూసి వేయడం వల్ల ఆర్టీసీ బస్సులు ఆర్వోబీపై నుంచి వచ్చి తిరిగి బస్టాండ్‌లోకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. కొన్ని బస్సులను బస్టాండ్‌లోకి రాకుండానే తీసుకెళ్లిపోతున్నారు. కర్ణాటక బస్సులన్నీ ఆర్వోబీపై నుంచి నేరుగా వెళ్లాయి. ఆర్వోబీ రెండు వైపులా వాహనాలు కిందకు వచ్చిన తర్వాత యూ టర్న్ తీసుకోడానికి తగిన రోడ్డు వెడల్పు లేక ఇబ్బందులు పడ్డారు.